

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

- పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ సబ్ రిజిస్ట్రార్ బదిలీ


వేములవాడ, మే 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ సబ్ రిజిస్ట్రార్ రాజిరెడ్డి మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన రాజిరెడ్డి స్థానంలో వేములవాడ సబ్ రిజిస్ట్రార్‌గా ఇంకా ఎవరిని నియమించలేదు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా కోడె రమేష్

గంభీరావుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కోడె రమేష్ నియామకమయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కోడె రమేష్ ఇప్పటికి వరకు కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా కొనసాగారు. ముందు నుంచి బీజేపీలో రమేష్ క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా రమేష్ నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో పార్టీ అధిష్ఠానం అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, అందరిని కలుపుకుని పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరిస్తానని రమేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల పార్టీ నాయకులకు, కార్యకర్తలకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇల్లంతకుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి ఆదివారం పరామర్శించారు. పొత్తూరు గ్రామానికి చెందిన దామెర కనుకవ్వ, జవారిపేట గ్రామానికి చెందిన పల్లె అందయ్యలు వివిధ కారణాలతో మృతిచెందగా కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వీరి వెంట శేఖర్, జేరిపోతుల అనీల్, ఎల్లయ్య, రాజయ్య తదితరులు ఉన్నారు.



పంచాయతీ ఎన్నికలపై అయోమయం

జిల్లాలో పురుషులు, మహిళల ఓట్లు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
బోయినపల్లి	14,681	15,595	30,276
చందుర్తి	13,220	14,394	27,614
ఇల్లంతకుంట	19,391	20,512	39,903
గంభీరావుపేట	17,543	18,639	36,183
కోనరావుపేట	16,795	17,666	34,461
ముస్తాబాద్	18,529	19,613	38,142
రుద్రంగి	6,234	7,006	13,243
తంగళ్లపల్లి	18,372	19,432	37,804
వీర్నపల్లి	5,713	5,836	11,549
వేములవాడ	8,877	9,296	18,189
వేములవాడరూరల్	8,914	9,699	18,613
ఎల్లారెడ్డిపేట	19,417	20,865	40,282
మొత్తం	1,67,686	1,78,553	3,46,259

(ఇతరులు 20)

- ఆశావహుల ప్రయత్నాలకు నిరాశ
- రిజర్వేషన్ల ప్రక్రియతోనే ఆలస్యం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తేలే వరకు ఆగాల్సిందే
- జూలైలో ఎన్నికల అంటూ ఊరిస్తున్న సర్కార్
- కేంద్ర కులగణనతో మరింత జాప్యం
- 15 నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన
- జిల్లాలో 260 గ్రామపంచాయతీలు.. 3,46,259 మంది ఓటర్లు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

స్థానిక పోరు ఇప్పట్లో రానంటున్నాయ్.. ఒకవైపు ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లతో సర్వం సన్నద్ధమైన సామాజికవర్గాల రిజర్వేషన్లు బ్రేక్ వేస్తున్నాయి. ప్రధానంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పంచాయతీ తేలే వరకు స్థానిక ఎన్నికలు జరిగే సంకేతాలు కనిపించడం లేదు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎన్నికలను ఊరిస్తూ వాయిదాలు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టే అవకాశాలు ఉండడంతో గ్రామపంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే అని అభిప్రాయంతో ఆశావహులు నిరాశ చెందుతున్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచేందుకు సవరణ కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించారు. సవరణ కావాలంటే పార్ల మెంట్‌లో బిల్లు పాస్ చేయాల్సి ఉంటుంది. కేంద్రం ఈ ప్రక్రియ ఇంకా మొదలు పెట్టకపోయినా రాష్ట్ర ప్రభుత్వం జూలైలో ఎన్ని కలంటూ ఆశలు కల్పిస్తున్నారు. దీంతో ఎలక్షన్ల కోసం ఎదురు చూస్తున్న ఆశావాహులు అయోమయంలో పడ్డారు.

2024 జనవరి నెలలో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీకాలం ముగిసినా ఎన్నికలపై ఇప్పటికీ గందరగోళ పరిస్థితి వీడటం లేదు. ప్రస్తుత రిజర్వేషన్ల పరిస్థితుల్లో మరో ఆరు నెలల పాటు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలతో పాటు మున్సిపల్, జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే అంటూ అధికారులు ఆశావహులు ఉన్నారు. అధికార యంత్రాంగం ఓటర్ జాబితాతో పాటు ఇతర ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ గుర్తులతో పాటు సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచారు. కానీ ఆశావహులకు ఎదురు చూపులు మాత్రం తప్పడం లేదు.

నోటిఫికేషన్ రావడమే తరువాయి..

రాజన్నసిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వం చెప్పినట్లు జూలైలో ఎన్నికల వచ్చిన అధి కార యంత్రాంగం మాత్రం గ్రామపంచాయతీ ఎన్నిక ల నిర్వహణకు సర్వం సిద్ధంగా ఉన్నారు. 2019 గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించింది. ఈసారి కూడా మొదట్లో మూడు విడతలుగా ఏర్పాటు చేసినా రెండు విడతల్లోనే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశించడం దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో మొదటి విడతలో 137 సర్పంచ్‌లు, 1,888 వార్డులు, రెండో దశలో 123 గ్రామాలు, 1,080 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేశారు.

ఓటరు జాబితా రెడీ...

జిల్లాలో గ్రామపంచాయతీ (మిగతా 8వ పేజీలో)



కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి

- సీఐడీ నార్కోటిక్స్ ఎస్పీ భూక్య రాంరెడ్డి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో సీఐడీ నార్కోటిక్స్ ఎస్పీ రాంరెడ్డి

వీర్నపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిన్నప్పటి నుంచి కష్టపడి చదివితేనే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చని సీఐడి నార్కోటిక్స్ ఎస్పీ భూక్య రాంరెడ్డి నాయక్ అన్నారు. వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండా గ్రామంలో తన తండ్రి ధూమా నాయక్ పేరుపై ట్రస్టును ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ట్రస్ట్ చైర్‌పర్సన్ భూక్య విజయతో కలిసి శాలువాలతో సన్మానించి డిక్షనరీలను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతం నుంచి విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణం అన్నారు. ఇదే స్ఫూర్తితో రాణించి భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ సాధించాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులు చదువుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ రామ్ సాయికిరణ్, మాజీ సర్పంచ్‌లు రవినాయక్, శ్రీనివాస్ నాయక్, గర్జనపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాకేష్ గౌడ్, బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్, నవీన్ నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కోనరావుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలోని సుద్దాల ప్రభుత్వ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు తోటి విద్యార్థినికి ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. సుద్దాల ప్రభుత్వ పాఠశాలలో 2004-05 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పల్లిమక్త గ్రామానికి చెందిన తోటి విద్యార్థిని కవిత భర్త ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబానికి 15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు జిన్న అనిల్, కచ్చకాయల మహేష్, ఎర్రవెల్లి నరేష్, బాదనేని సిద్దిరాజు, అలిపిరి మధు, జిన్న బాబు, మేకల బాబు, ఎనగంటి రమేష్ తదితరులు ఉన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే యువసేనల ఏర్పాటు

- యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగేల రాజు



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నాయకుడు మునిగెల రాజు

తంగళ్లపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసమే యువసేనలు ఏర్పాటు చేస్తున్నారని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగేల రాజు ఆరోపించారు. ఆదివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రాజు మాట్లాడారు. ప్రజల్లో పార్టీ ప్రాబల్యం తగ్గిందని సేనల పేరుతో కొత్త నాటకాలకు తెర తీశారని విమర్శించారు. గతంలో కేటీఆర్‌ను గాడిదతో పోల్చిన కేటీఆర్ యువసేన నాయకుడు మెంగని మనోహర్‌కు ఇప్పుడు కేటీఆర్ దేవుడు ఎలా అయ్యాడో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ పబ్బం కోసం పైసలు సంపాదించుకోవడానికి సేనలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. సేనలు ఏర్పాటు చేసిన వారు గతంలో ఇసుక మాఫియా, భూ మాఫియాలకు పాల్పడ్డవారేనని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో సేనల పేరుతో అవినీతి, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు చుక్క శేఖర్, ఏగుర్ల ప్ర శాంత్, గుగ్గిళ్ల భరత్, గడ్డం మధుకర్, గుగ్గిళ్ల అభినయ్, ఎడ్ల తిరుపతి, భాను, యోగి, వినోద్, దేవదాస్, ప్రశాంత్, చందు, మణి పాల్గొన్నారు.

రోడ్డుపై మురికి నీరు

- ఇబ్బంది పడుతున్న గొల్లపల్లి వాసులు



గొల్లపల్లిలో రోడ్డుపై పారుతున్న మురికి నీరు

కోనరావుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్డుపై మురికి నీరు పారడంతో గొల్లపల్లి వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లిలో మురికి నీరు ప్రధాన రహదారిపై పారుతుండడంతో వాహనదారులు, పల్లె వాసులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ నీరు ఊరు చివరలో ఎటుపోని పరిస్థితుల్లో ఉండడం వల్ల మురికి నీరు కాలువలో నిలిచి రోడ్డుపైకి పారుతోంది. గతంలో ఈ మురికి నీరంతా పొలంలోకి వెళ్లేది. కానీ ఆ రైతు పొలంలోకి మురికినీరు రాకుండా అడ్డుకట్ట వేయడంతో డ్రైనేజీ నీరంతా రోడ్డుపై పారుతోంది. దీనివల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి డ్రైనేజీ నీరుబయటకు వెళ్లడానికి శాశ్వత పరిష్కారం చూపాలని పల్లె వాసులు కోరుతున్నారు.

గ్రామదేవతల పండుగలతో ప్రజల్లో ఐకమత్యం

- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ఇల్లంతకుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవతల పండుగలతో ప్రజల్లో ఐకమత్యం పెరుగుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ఇల్లంతకుంట, రామోజిపేట గ్రామాల్లో జరుగుతున్న పెద్దమ్మతల్లి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామదేవతలను పూజించడం అనాదిగా కొనసాగుతోందన్నారు. పెద్దమ్మతల్లి దీవేనలతో సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని, గతంలో హైమాస్ట్ లైట్ అడుగగా మంజూరు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ముదిరాజ్ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, నియోజకవర్గ అధికారప్రతినిధి పసుల వెంకటి, ముదిరాజ్ సంఘ అధ్యక్షులు గొడుగు నర్సయ్య, పిల్లి వెంకటి, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, కూనబోయిన బాలరాజు, రేగుల కార్తీక్, దేవయ్య, సుధాకర్, ఎండ్ర బుచ్చయ్య, రఘు, కూనబోయిన వేణు, ఒగ్గు రమేష్, మాధవరెడ్డి, తీగల పుష్పలతనాగయ్య, నేరెళ్ళ విజయ్, నరేందర్‌రెడ్డి, ఉప్పునూటి రవి వివిద గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

● ఉగ్రవాద మూలాలు దేశంలో లేకుండా చూడాలి..

ఇల్లంతకుంట, మే 11(ఆంధ్రజ్యోతి) ఉగ్రవాద మూలాలు దేశంలో లేకుండా చూడవలసిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబీకులకు ఏమి ఇచ్చినా తీర్చలేనిదన్నారు. గతంలో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగినప్పుడు ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకం అన్నారు. కాల్పుల విరమణ చేయడానికి గల కారణాలను ప్రధానమంత్రి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అమెరికా ఒత్తిడికి లోనై ఈనిర్ణయం తీసుకున్నారని ప్రజల్లో చర్చ మొదలయ్యిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అందరికి న్యాయం జరుగుతుందని వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, మహేందర్‌రెడ్డి, పసుల వెంకటి, రేగల కార్తీక్, ఒగ్గు రమేష్ , మాధవరెడ్డి, విజయ్, తీగల పుష్పలత పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసంలో సిబిల్‌స్కోర్ నిబంధన తొలగించాలి

ఇల్లంతకుంట, మే 11(ఆంధ్రజ్యోతి) రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకంలో సిబిల్‌స్కోర్ నిబంధన తొలగించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుపేద యువకులు దరఖాస్తు చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో లక్షలాది మంది యువకులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. నూతన నిబంధన యువకులకు ప్రతిబంధకంగా మారిందన్నారు.

ప్రభుత్వం స్పందించి వెంటనే సిబిల్‌స్కోర్ విధాన నిబంధనను తొలగించాలని, లేనట్లయితే యువకులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు ఏనుగుల లింగన్న, మామిడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలో మాజీ మంత్రి కేటీఆర్



ఎల్లమ్మను దర్శించుకుంటున్న కేటీఆర్, నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామంలో ఎల్లమ్మ సిద్దోగం వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై ఎల్లమ్మ దేవతను దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో నాయకులతో కలిసి పూజలు చేశారు. అనంతరం మాజీ ఎంపీపీ పిల్లి రేణుక ఇంట్లో తేనీటి విందు స్వీకరించారు. ఆయన వెంట నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గూడూరి ప్రవీణ్, మండల అధ్యక్షుడు వర్స కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ ఛైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఉన్నారు.

గల్ఫ్ బాధితుడికి కేటీఆర్ భరోసా..

తంగళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌లో రోడ్డు ప్రమాదానికి గురై అసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచాడు. గల్ఫ్ నుంచి స్వదేశానికి తీసుకువచ్చే బాధ్యత తనదేనని కుటుంబ సభ్యులను పరామర్శించి బాధితుడికి భరోసా కల్పించారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన మంద మహేశ్ సౌదీఆరేబియా దేశానికి ఉపాధి కోసం వెళ్లి రోడ్డు ప్రమాదానికి గురై అసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాను పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ కేటీఆర్ ఆదుకోవాలని, స్వదేశానికి రప్పించాలని ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా ద్వారా కేటీఆర్‌ను వేడుకున్నాడు. కేటీఆర్ ఆదివారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలోని బాధితుడి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. గల్ఫ్‌లో ఉన్న మహేశ్‌తో వీడియో కాల్ మాట్లాడారు. గల్ఫ్‌లో చికిత్స పొందుతున్న ఆసుపత్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని స్వదేశానికి నాలుగురోజుల్లో రప్పించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. స్వదేశానికి రప్పించి చికిత్స చేయించే బాధ్యత తనదేనని బాధితుడితో పాటు కుటుంబానికి భరోసా కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరో ఇద్దరికి గాయాలు



నిచిత్ వర్మ (ఫైల్)

వెల్గటూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం శాఖాపూర్ వద్ద వరంగల్-రాయపట్నం రాష్ట్ర రహదారిపై ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో నిచిత్‌వర్మ(17) అనే బాలుడు మృతిచెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం రాజక్కపల్లి గ్రామానికి చెందిన దొరిశెట్టి నిచిత్‌వర్మ(17), అతడి స్నేహితుడు పత్తిపాక కీర్తి చంద్ర(17) శాఖాపూర్‌లోని వాటర్‌ప్లాంట్‌కు స్కూటీపై నీళ్ల కోసం వెళ్లారు. బెజ్జంకి మండలం బేగంపేటకు చెందిన అన్నాజి విక్రం(20) అనేవ్యక్తి మరొకరితో కలిసి కరీంనగర్ వైపు బైక్‌పై అతివేగంగా వెళ్తూ స్కూటీని ఢీకొట్టాడు. స్కూటీపై వెళ్తున్న నిచిత్‌వర్మ, కీర్తిచంద్రలకు తీవ్రగాయాలు కాగా కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికితరలించారు. నిచిత్‌వర్మ పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కీర్తి చంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా మృతుడు నిచిత్‌వర్మ ప్రస్తుతం ఇంటర్మీడియట్ పూర్తిచేసి, హనుమాన్ మాల ధరించాడు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి దొరిశెట్టి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైకు నడిపిన అన్నాజి విక్రమ్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



ముత్యం రెడ్డి (ఫైల్)

గన్నేరువరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారువెల్ల గ్రామపరిధిలోని దుబ్బపల్లికి చెందిన ఏలేటి ముత్యంరెడ్డి (63) పురుగులమందు తాగగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఎస్‌ఐ తాండ్ర నరేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలేటి ముత్యం రెడ్డి గతంలో అడవిపంది దాడిలో గాయపడగా నాడీవ్యవస్థ దెబ్బతింది. కొద్దిరోజులు మంచానికే పరిమితం అయ్యాడు. దీంతో అనారోగ్యసమస్యలు తీవ్రమవడంతో మనస్థాపానికి గురై శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ముత్యంరెడ్డి భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

పెద్దపల్లి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుర్రాంపల్లి గ్రామానికి చెందిన అటుకుల రవిందర్‌రెడ్డి (45) అనే రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం రవిందర్‌రెడ్డి వ్యవసాయ కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడని, ఇటీవల కూతురు వివాహం చేయగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అయ్యాయని మద్యానికి బానిసైనట్లు తెలిపారు. ఈనెల 9న రాత్రి పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి



మృతి చెందిన మల్లేష్

ముత్తారం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన పందుల మల్లేష్ (17) అనే యువకుడు ఆదివారం ట్రాక్టర్ కింద పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ గోపతి నరేష్ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన పందుల శేఖర్‌కు చెందిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేసేందుకు మల్లేష్ వెళ్ళగా వడ్లను నిమ్మల కుమార్ చెందిన ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్నారు. ఒక్కసారిగా ట్రాక్టర్ ముందుకు వెళ్ళడంతో అదుపు చేసేందుకు మల్లేష్ ప్రయత్నించగా టైర్ కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో అక్కడే ఉన్న రైతులు మల్లేష్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కోరుట్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గొడుగు రాజవ్వ(75) అనే వృద్ధురాలు గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆదివారం మృతిచెందినట్లు కోరుట్ల ఎస్‌ఐ2 రామచంద్రుడు తెలిపారు. రాజవ్వ కోరుట్ల పట్టణంలో కూలి పని చేస్తూ జీవిస్తోంది. అర్బన్ కాలనీ వద్ద జాతీయరహదారిని దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. రాజవ్వ కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ రామచంద్రుడు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

తిమ్మాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన ఓవ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన తిరుపతిరావు ఆదివారం తన భార్యకు ఫోన్‌చేసి తను గడ్డిమందు తాగినట్లు తెలిపాడు. వెంటనే ఆమె స్థానికులకు సమాచారం అందించగా వారు సంగంపల్లి గ్రామశివారులో అపస్మారకస్థితిలో ఉన్న తిరుపతిరావుని గుర్తించారు. వెంటనే అతడిని 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కొన్ని నెలలక్రితం తిరుపతిరావు కొడుకు నిఖిల్‌రావు ఆన్‌లైన్‌లో గేమ్ ఆడి డబ్బులను పోగొట్టుకొని మన్నెంపల్లి శివారులో బావిలోపడి మృతిచెందాడు. అప్పటి నుంచి మనస్థాపంతో ఉన్న తిరుపతిరావు ఆదివారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇదిలాపూర్ గ్రామ శివారులో ఆదివారం కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన చొప్పరి సదానందం ద్విచక్ర వాహనంపై వస్తుండగా జమ్మికుంట నుంచి గోదావరిఖనికి వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు సదానందం కాళ్లకు,తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన సదానందంను ఆటోలో మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లికి తరలించారు. గ్రామస్థులు కారును అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



మణిచరణ్(ఫైల్)

రాయికల్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం కుమ్మరిపల్లిలో ఈతకు వెళ్లి జగిత్యాలకు చెందిన మణిచరణ్ (13) ఆదివారం మృతిచెందాడు. జగిత్యాలకు చెందిన బింగిరాధ చిన్న కుమారుడు మణిచరణ్ రాయికల్‌లోని అమ్మమ్మ ఇంటివద్ద ఉండి స్థానికప్రైవేట్ పాఠశాలలో 9వతరగతి చదువుతున్నాడు. కుమ్మరిపెల్లిలోని బంధువుల ఇంటికి ఆదివారం వెళ్లి ఈత కొడతామని వ్యవసాయ బావిలో దిగగా ఈతరాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు.

రోగుల సంరక్షణలో నర్సుల పాత్ర కీలకం

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



జగిత్యాల/కళ్యాణ్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): రోగుల సంరక్షణలో కనిపించే దేవుళ్లలా పని చేసేవారు నర్సులు. తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా రోగులకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నర్సులు పని చేస్తున్నారు. అంతర్జాతీయ నర్సింగ్ డేను యేటా మే 12న ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు సందర్భంగా నర్సింగ్ డేను జరుపుకుంటారు. తమకు ఎన్ని కష్టాలున్నా విధుల్లో అంకితభావంతో పని చేసేవారు నర్సులు. కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఎంతో మందిని కాపాడారు. ప్రపంచంలో ఆరోగ్య కార్యకర్తల్లో సగానికి పైగా నర్సులు ఉన్నారు. విధుల్లో ఒత్తిడికి గురి కావడం, రోగుల సంరక్షణలో ఏదైన జరుగరానిది జరిగినప్పుడు రోగి బంధువులు నర్సులనే లక్ష్యం చేస్తూ దాడులకు, బెదిరింపులకు పాల్పడడం, కొన్ని సందర్భాల్లో నర్సులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. రోగులకు చికిత్స అందించే సమయంలో వారికి సరైన రక్షణ, సౌకర్యాలు లేకపోవడం, రోగుల నుంచి సంక్రమించే వ్యాధులను వారిని వేధిస్తున్నాయి. ఎందరో అంటువ్యాధుల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా వృత్తినే పరమావధిగా భావించే నర్సులు రోగులకు అపారమైన సేవలందిస్తూ వారి ప్రాణాలను కాపాడడంలో నర్సుల పాత్ర కీలకం.

సేవ చేయడమే లక్ష్యం...

- సౌందర్య, నర్సింగ్ సూపరింటెండెంట్



ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రోగులకు సేవలు అందించడమే తమ లక్ష్యం. కరోనా సమయంలో కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించా. విధుల్లో ఇబ్బంది అయినా తట్టుకుంటున్నాం.

మిలటరీలో నర్సుగా చేరుదామనుకున్నా..

- సుమలత, నర్సు



ఆర్మీలో పని చేసే వారికి సేవ చేసేందుకు మొదట మిలిటరీలో నర్సుగా చేరాలనుకున్నా. ప్రయత్నం విఫలమయ్యింది. ఎంఎస్ నర్సింగ్ చేసి ప్రభుత్వ నర్సుగా నాలుగు సంవత్సరాల క్రితం జాయిన్ అయ్యా. ఎందరో రోగులు అవస్థతో వస్తుంటారు. వారికి రోగం నయం చేసిన తరువాత వారు పెట్టే దీవెనలు ఆనందాన్ని కలిగిస్తాయి.

రోగులను కంటికి రెప్పలా కాపాడతాం

-ప్రమిత, హెడ్ నర్సు, వైద్య సేవా అవార్డు గ్రహీత, రాయికల్



కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి కొవిడ్ వార్డుల్లో విధులు నిర్వహించాం. మేము దగ్గరుండి అన్ని రకాలుగా భరోసా కల్పించగా ఎంతో మంది మళ్లీ ఆరోగ్యంగా ఇంటికి వెళ్లడం సంతోషాన్నిచ్చింది. డాక్టర్లు సూచించిన చికిత్సలను రోగులకు అందిస్తూ కంటికి రెప్పలా కాపాడుతూ అంకిత భావంతో సేవలు అందిస్తున్నాం.

రెండు బైక్‌లు ఢీ

● ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద రెండుబైక్‌లు ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి చెందిన అక్కపల్లి లింబాద్రి బైక్‌పై కేశవపట్నం మెయిన్ రోడ్డుకు వస్తుండగా అంబేద్కర్ చౌరస్తా నుంచి కేశవపట్నంలోకి వెళ్తున్న బైక్ ఢీకొంది. దీంతో లింబాద్రి తన బైక్‌పై నుంచి కిందపడి పోయాడు. ఈ ఘటనలో లింబాద్రి కాలు విరిగింది. గమనించిన స్థానికులు వెంటనే 108లో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బీట్ ఆఫీసర్‌పై దాడి.. ఒకరిపై కేసు నమోదు

చందుర్తి, మే 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలపను తరలిస్తున్న వ్యక్తిని అడ్డుకున్న అటవీశాఖ అధికారిపై ఓ కలప స్మగ్లర్ దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం దేవునితండాలో శనివారం జరిగింది. చందుర్తి ఎస్‌ఐ అంజయ్య కథనం ప్రకారం దేవునితండా చెందిన అజ్మీరా తిరుపతి అనే వ్యక్తి సనుగుల అటవీ ప్రాంతం నుంచి కలపను తరలిస్తుండగా బీట్ ఆఫీసర్ బాలకృష్ణ అడ్డుకోవడంతో తిరుపతి అటవీశాఖ అధికారిపై దాడికి పాల్పడ్డాడు. బీట్ ఆఫీ సర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఓదెల, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గుంపులలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. గుంపుల సమీపంలోని మానేరువాగు నుంచి ఇసు కను అనుమతి లేకుండా తరలిస్తున్నారనే సమాచారంతో వెళ్లి పరిశీలించగా ఇసుక ట్రాక్టర్ పట్టుబడిందని, అలాగే సంబంధిత వ్యక్తిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్సై తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



గుంపులలో పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

షాపులోకి దూసుకెళ్లిన గ్రానైట్ లారీ

హుజూరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో ఆదివారం తెల్లవారు జామున గ్రానైట్ లారీ షాపులోకి దూసుకెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ నుంచి గ్రానైట్ లారీ హుజూరాబాద్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు బయటకు వెళ్తుండగా, బస్సును చూసిన గ్రానైట్ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో పక్కనే కరెంట్ స్తంభాన్ని ఢీ కొని షాపులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు వెనుక భాగం పాక్షికంగా దెబ్బతింది. షాపులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే బస్టాండ్ ఏరియాలో సుమారు 6గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని లారీని తొలగించారు. లారీడ్రైవర్‌పై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.



హుజూరాబాద్‌లో షాపులోకి దూసుకెళ్లిన గ్రానైట్ లారీ

రోడ్డు పక్కన నిల్చున్న యువతిని ఢీకొట్టిన కారు

● సంఘటన స్థలంలోనే మృతిచెందిన యువతి

● మరొకరి పరిస్థితి విషమం



మృతి చెందిన మౌనిక

చిగురుమామిడి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరి గ్రామ శివారులో హుస్నాబాద్-కరీంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ ఫంక్షన్‌హాల్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ట్రైనీ ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా జాబితాపూర్‌కు చెందిన మౌనిక(24) తన సోదరుడితో కలిసి సుందరగిరి గ్రామానికి చెందిన వారి బంధు వుల వివాహానికి వచ్చారు. గ్రామశివారులో ఉన్న ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహానికి హాజరై భోజనం చేసి సోదరుడితో కలిసి బయటకు వచ్చి రోడ్డు పక్కన నిల్చున్నారు. ఇంతలో హుస్నాబాద్ నుంచి కారు(టీఎస్ 02ఇజడ్9907) వేగంగా వచ్చి ఇద్దరిని ఢీకొట్టింది. దీంతో మౌనిక సంఘటన స్థలం లోనే మృతిచెందింది. మౌనిక సోదరుడికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమ్మిత్తం కరీంనగర్‌కు అంబులెన్స్‌లో తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోరుట్ల రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని సీసీఎస్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. కాకతీయ కాలువను ఆనుకొని ఉన్న వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్న వారిని గుర్తించి వారి వద్ద రూ.12,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒకరిపై దాడి.. కేసు నమోదు

వీణవంక, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన అమ్మ మహేందర్ తన ఇంటి పక్కన నిర్మాణ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన ఎజ్జూరాజు అడ్డుకున్నాడు. బూతులు తిడుతూ కర్రతో దాడి చేయగా మహేందర్ తలకు గాయాలయ్యాయి. మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రాజుపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబేషనరీ ఎస్‌ఐ సాయికృష్ణ తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

● వేములవాడలో పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

● ధర్మపురిలో పూజల్లో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



వేములవాడలో విశేషాలంకరణలో స్వామి వారి ఉత్సవమూర్తులు

వేములవాడ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయం నాంపల్లి గుట్టపై వెలసిన శ్రీ భూనిలా సహిత లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి అభిషేకం, హోమం, బలిహరణం నిర్వహించారు. కొండపైనున్న ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను పూలతో అందంగా అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు డప్పుచప్పుల్లు, కళాకారుల నృత్యాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ , రాజన్న ఆలయ ఈవో కె వినోద్‌రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు రాచకొండ రామాచారిసంధ్యారాణి దంపతులు కన్యాదాతలుగా వ్యవహించగా, అర్చకులు రాచకొండ విజయేంద్రచారి, రామకృష్ణాచారి, హర్షవర్ధనచారి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణతోపాటు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతీఒక్కరి బాధ్యత అన్నారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా కరీంనగర్ సజ్జప్ప కళాక్షేత్రం, సజ్జప్ప కూచిపూడి డ్యాన్స్, మ్యూజిక్ అకాడమీ వారి కళాప్రదర్శనలు అందరిని అలరించాయి. కళాకారులను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సన్మానించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవానికి వరంగల్‌కు చెందిన తోపుచెర్ల శ్రీనాథ్‌స్వాతి దాతలుగా వ్యవహరించగా. ముస్తాబాద్‌కు చెందిన రాసమడుగు నర్సింగారావు భక్తులకు తాగునీరు అందించారు. కల్యాణం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్, అశోక్, ఈఈ రాజేశ్, డిఈ మహిపాల్ రెడ్డి, సూపరిండెంట్లు వెంకటరాజు, పూజిత, ఆలయ ఇన్‌చార్జి నరేందర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురిలో.. నరసింహస్వామి జయంత్యుత్సవాలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో నరసింహ జయంతి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసకపూర్వక, శోడషోపచార పూజ నిర్వహించారు. నృసింహ జయంతి సందర్భంగా రాజగోపురాలకు, శ్రీ స్వామి వారలకు, దేవాలయాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో రెండు లడ్డు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 3 నుంచి ఆరంభమైన నరసింహ నవరాత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి.

● హోమంలో పాల్గొన్న మంత్రి దామోదర..

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద నిర్వహించిన నరసింహ హోమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం పాల్గొ న్నారు. లోకక్షేమార్థం, కుటుంబసౌభాగ్యం కోసం నిర్వహించిన నిత్య నరసింహ హోమంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహచే ఆలయ అర్చకులు నంబి అరుణ్‌కుమార్, చక్రపాణి కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి యాగశాల వద్ద భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. యాగశాల వద్ద మంత్రికి ఆలయ అర్చకులు తీర్థ, ప్రసాద వితరణ జరిపి, ప్రసాదాలు బహూకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



వేములవాడలో స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజన్న ఆలయ ఈవో వినోద్



ధర్మపురిలో పూజలందుకుంటున్న నర్సింహస్వామి



ధర్మపురిలో మంత్రి దామోదర రాజనర్సింహకు స్వామి వారి ఫొటోను అందజేస్తున్న ఎమ్మెల్యే,విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అధికారులు

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

- బ్రాందీ షాపుపై దాడి
- ముగ్గురిపై కేసు

కోల్‌సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఊర్వశి థియేటర్ సమీపంలోని మెగావైన్స్‌లో శనివారం రాత్రి ముగ్గురు యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. వైన్స్‌లోని సిట్టింగ్ రూమ్‌లో మద్యం సేవించిన చింటు, మల్లికార్జున్, ఆరీఫ్ అనే యువకులు వైన్స్ కౌంటర్‌లోకి చొరబడి గొడవకు దిగారు. బీరు సీసాలు, ఇతర మద్యం బాటిళ్లను పడేశారు. కౌంటర్‌లోని వ్యక్తులను చంపుతామని బెదిరింపులకు గురి చేశారు. దీంతో మద్యంషాపు నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వీరిపై కేసు నమోదైంది. షాపులోని సీసీ ఫుటేజీలో ఈ దాడి దృశ్యాలు రికార్డు అయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తమదైన పద్ధతిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకోగా గొడవకు కారణమైన నిందితుడు మల్లికార్జున్ పరారీలో ఉన్నట్టు తెలుస్తున్నది.

హనుమాన్ జయంతి ఏర్పాట్లు షురూ..

- కొండగట్టులో 20 నుంచి ఉత్సవాలు
- సమన్వయ సమావేశం నిర్వహించని అధికారులు



కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, మే 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 20 నుంచి మూడు రోజుల పాటు హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఆలయానికి రంగులు వేసే పనులు సాగుతున్నాయి. ప్రధాన ఆలయం రాజగోపురం, ప్రాకారం తదితర వాటికి రంగులు వేస్తున్నారు. ఈ పనుల పూర్తికి మరో ముడు రోజులకు పైగా పట్టనుండగా మిగతా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. మరికొన్ని చిన్న హనుమాన్ జయంతికి ఏర్పాటు చేసిన వాటినే కొనసాగించనున్నారు. అయితే చలువ పందిళ్లు కోతులతో, అకాల వర్షంతో దెబ్బతినగా వాటికి మళ్లీ మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

● సమన్వయ సమావేశం ఎప్పుడో..?

హనుమాన్ జయంతి ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేసేందుకు గాను ప్రతి ఏటా నిర్వహించే సమన్వయ సమావేశం ఇంత వరకు నిర్వహించలేదు. దీంతో జయంతి ఏర్పాట్లపై ఎవరికి వారే అన్న తీరుగా మారుతోంది. ప్రతి ఏటా జయంత్యుత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు కొండగట్టుకు వస్తుంటారు. దీనికి గాను పదిహేను రోజుల ముందుగానే ఎమ్మెల్యే, కలెక్టర్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులతో ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై చర్చించి తగు చర్యలు చేపట్టడానికి సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఈసారి పెద్ద జయంతి వేడుకలకు మరో పది రోజుల గడువు మాత్రమే ఉంది. ఉత్సవాల సందర్భంగా పోలీసు, పంచాయతీరాజ్, రెవెన్యూ, మిషన్ భగీరథ, ఆర్టీసీ, ఫైర్, నీటి పారుదల శాఖ తదితర శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించనుండగా ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి కేటాయించిన పనులలో ఇదివరకే నిమగ్నం కావాల్సి ఉంది. గత చిన్న జయంతి ఏర్పాట్లే ఇప్పుడు కొనసాగించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నప్పటికీ ఉత్సవాల సందర్భాలలో ప్రతి ఏటా భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా సమన్వయ సమావేశం నిర్వహించి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.



కొండగట్టు ఆలయానికి రంగులు వేస్తున్న సిబ్బంది

హుజూరాబాద్‌లో రూ.200 దొంగ నోట్ల కలకలం



వ్యాపారికి వచ్చిన దొంగ నోటు

హుజూరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అసలు, నకిలీ నోట్లకు తేడా లేకుండా పోతోంది. తాజాగా హుజూరాబాద్ పట్టణంలోని ఓ కిరాణం షాపులో సామాను తీసుకొని ఓ వ్యక్తి రూ.200 నోట్లు ఇచ్చారు. ఇది గమనించకుండా సదరు వ్యాపారి తీసుకొన్నాడు. వాటిని మరో వ్యక్తికి ఇస్తుండగా రెండు రూ.200నోట్లు నకిలీగా గుర్తించారు. దీంతో వ్యాపారి కంగుతిన్నాడు. దొంగనోట్లు కూడా అసలుకు తేడా లేకుండా ఉండడంతో లబోదిబోమన్నాడు. గతంలో కూడా రూ.500 దొంగ నోట్లు వచ్చిన సంఘటనలున్నాయి. ఇప్పటికైనా పోలీసులు దొంగ నోట్లపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఎఫ్‌సెట్ ఫలితాల్లో అల్ఫోర్స్ చరిత్రాత్మక విజయం



ఎఫ్‌సెట్‌లో ర్యాంకులు సాధించిన టాపర్లతో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి

సుభాష్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎఫ్‌సెట్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థలు చరిత్రాత్మక విజయం సొంతం చేసుకున్నాయి. కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. బి వర్షిత్203, అదిబాఫిర్దోజ్ 206, ఎం ప్రణీత్ 250, కె మనోజ్‌కుమార్ 286, బి శ్రీనిత్య 296, జి కౌషల్‌ప్రియ 339, జి రిషిత 438, జె అనూష 447, కె అర్చన 485, ఎండి అబ్దుల్‌జిషాన్ 551, సిహెచ్ శ్రీనిధి 567, ఎంరోహిత్‌రెడ్డి 606,అబుఉమేర 614, హాస్నమహవిష్ 639, పి శ్రీనిత్యరెడ్డి 704, కె శ్రీరామ్ చరణ్732, కె హాసిని 735, రాంసకోరిన్ 738, డి సుమగ్నయ752, ఎల్ శరణ్య762, జి సింధు763, బి అభిజ్ఞ 801, జె వామిక 807, వి అక్షయ్ 831, డి హరిశంకర్ 838, బి భువనకృతి 839, ఎ శశిప్రీతమ్ 853, కె సాయిశ్రేయాన్షరెడ్డి 908, వి హృషికేష్ 920, మహ్మద్ సఫ్రోజ్ 927, కె గాయత్రి 992, ఎ శ్రీనిజరెడ్డి 997ర్యాంకు సాధించారు.33మంది విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించగా, 72మంది విద్యార్థులు 2000లోపు ర్యాంకులు, 102 మందివిద్యార్థులు 3000లలోపు ర్యాంకులు, 192మంది విద్యార్థులు 5000లలోపు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించారని అభినందించారు. ఇటీవల ప్రకటించిన ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ మంచి ఫలితాలు సాధించిందని తెలిపారు. 461 మంది విద్యార్థులు ఐఐటీ మెయిన్స్‌కు అర్హత సాధించారని తెలిపారు. పటిష్టమైన ప్రణాళికతో బోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషితో ఘనవిజయాన్ని సాధించామన్నారు. రానున్న ఐఐటీ అడ్వాన్స్, నీట్ పరీక్ష ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడానికి అధ్యాపకులు, తల్లిదండ్రుల కృషి ఎంతగానో ఉందని వారందరినీ అభినిందుస్తున్నట్లు తెలిపారు.

● అధ్యాపకులు, తల్లిదండ్రుల సహకారంతో ర్యాంకు సాధించాను..

- అదిబఫిర్దోస్, 206 ర్యాంకు



మా నాన్న చిరువ్యాపారి అయినప్ప టికీ మమ్మల్ని బాగా చదివిస్తున్నారు. నేను ఈ ర్యాంకు సాధించడానికి తల్లి దండ్రుల సహకారం, అధ్యాపకులు కృషి ఎంతగానో ఉంది. ఎఫ్‌సెట్‌లో 206 ర్యాంకురావడం ఉత్సాహాన్నిచ్చింది. నీట్‌లోనూ మంచి ర్యాంకు సాధిస్తాను.

ట్రినిటి విద్యార్థుల విజయభేరి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

సుభాష్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సెట్-2025 ఫలితాల్లో ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కబనరిచి ర్యాంకుల సాధనతో విజయభేరి మోగించారు. తమ విద్యార్థులు 405, 430, 560, 697, 730, 760, 791, 859, 934, 1104, 1166, 1546, 1619, 1795, 1950 ర్యాంకులు సాధించినట్లు ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. అలాగే 10 వేలలోపు 89 మంది ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్‌తో పాటు ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి అభినందించారు.

ఎస్‌ఆర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

గణేశ్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సెట్ ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్ జోనల్‌ఇన్‌చార్జి నేదురు తిరుపతి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అత్యున్నతమైన ఫలితాలను సాధించి ఎస్‌ఆర్ విద్యాసంస్థల కీర్తిని చాటిచెప్పిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఎం.వినయ్ 149వ ర్యాంకు, ఎం కార్తీక్ 234, జాభిరామ్ 471, సిహెచ్ హన్సిక 539, ఎం రాజా వర్షిత్‌రెడ్డి 564, బి.మాధవ్ 750,కె సంజయ్ 886,జి.శివసాయి,887,ఎన్ పూజిత1077, ఆదిత్య 1304, ప్రాశ్రిత్ 2179, వి అమూల్యశ్రీ 2457, ఎం. రుశీశ్వర్‌రెడ్డి 2672, జే.సహస్ర 3487, కె.తేజశ్రీ 5032, బి.నాగచైతన్య 5565, కె.జాహ్నవి3896, బి ఆదిత్య వర్ధన్5838, అంజిరెడ్డి 6527 , బి.ప్రవళిక 6797, కె.రాకేష్ 6999, మనుష 7052, డి సాయి చందన 7251, ఎం.సుమలత 8005, కటకం శ్రీలేఖ 8088, డి.రాజ్‌కుమార్8323, ఎన్ శ్రీచరణ్ జోషి 8522, అబ్దుల్ రాయన్9213, శివరామ్9333, ఎన్ సాయిశ్రీనిక 9542, బి సహస్ర 9851, రాష్ట్రస్థాయిలో అఖండ విజయాన్ని సాధించిన విద్యార్థులను, ప్రోత్సహించిన వారి తల్లిదండ్రు లను, అధ్యాపకబృందానికి ఎస్‌ఆర్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, సీఈవో, డీజీఎం, జోనల్ ఇన్‌చార్జి, అకడమిక్ డీన్స్ ప్రిన్సిపాల్స్ శుభాకాంక్షలు తెలిపారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఎస్‌ఆర్ విద్యాసంస్థల అధ్యాపకులు

శ్రీచైతన్య విద్యార్థుల విజయఢంకా

సుభాష్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎఫ్‌సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ర్యాంకుల ప్రభంజనం సృష్టించారు. గోకులకొండ వైష్ణవి 810, బి మనోజ్ఞ 968, బి సాత్విక్ 1142, పి స్ఫూర్తిశ్రీ 1527, బి శ్రావణి 1803, పి బ్లెస్సీ సుసన్ 2106, పి చందన 2165, పి భరత్‌రెడ్డి 2815, పి అజితేష్ 3016, కె అనూహ్య 3503, వి ప్రవీణ్, వి రిషి 3996, జి అర్చన 4171, ఆర్ శ్రీయాన్ 4246, వి శివాణి 4570, బి స్రవంతి 4957తో పాటు 16 మంది విద్యార్థులు 5000లోపు, 51మంది విద్యార్థులు 10వేల లోపు రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా చైర్మెన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల ప్రణాళిక, అధ్యాపకుల కృషితో విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించారని అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.



వైష్ణవి (810 ర్యాంకు)



మనోజ్ఞ (968 ర్యాంకు)

శాతవాహన పరిధిలో 14నుంచి డిగ్రీ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు టైం టేబుల్ ప్రకారం మే14 నుంచి యథావిధిగా జరుగుతాయని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా. డి సురేష్‌కుమార్ తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించిన కళాశాల విద్యార్థులకే పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా పరీక్ష ఫీజు చెల్లించని అనేక ప్రైవేటు కళాశాలలు 12వ తేదీలోగా ఫీజు చెల్లిస్తాయని భావిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలోనే విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా ప్రారంభమైన ఏజెఆర్ ఆటోమోటివ్స్

- ప్రారంభించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



ఏజెఆర్ ఆటోమోటివ్ షోరూంను ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు మెయిన్ రోడ్డులో విట్స్ కళాశాల ఎదురుగా బుల్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఏజెఆర్ ఆటోమోటివ్ షోరూం ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి బుల్ మిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సౌత్ జోన్ హెడ్ వి సోమసుందరం, బుల్ మిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్టేట్ హెడ్ ఎన్ సురేష్‌బాబు, షోరూం అథరైజ్డ్ డీలర్ అంబటి జోజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ బుల్ కంపెనీ ఒక స్టాండర్డ్ పోర్టు, స్టాండర్ట్ క్వాలిటీ, మంచి పెర్ఫార్మెన్స్‌తో ఉంటుందని తెలిపారు. కంపెనీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. లోడ్ వర్క్సుగానీ, ఇసుక వర్క్సుగానీ, మట్టి పనులకు ఎక్కడ అవసరం ఉన్నా ఈ కంపెనీని తప్పకుండా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. జోజిరెడ్డి మాట్లాడుతూ బుల్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్‌తో గంటకు లీడర్ డీజిల్ ఆదా అవుతుందన్నారు. ఇతర వెహికిల్స్‌కన్నా మెరుగైన పనితీరు, మెరుగైన క్వాలిటీతో ఉంటుందని తెలిపారు. సేవలు అవసరం ఉన్నవారు వెహికిల్ డెమో బుక్ చేసుకోవాలని కోరారు. అలాగే సర్వీస్ విషయంలో కూడా 100 శాతం క్వాలిటీతో అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ జగ్గారెడ్డి, సంతోష్, కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

జూపాకలో అగ్నిప్రమాదం

హుజూరాబాద్ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపాక గ్రామంలో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామంలోని వ్యవసాయక్షేత్రంలోని వరికొయ్యలకు నిప్పుపెట్టడంతో మంటలు పెద్దఎత్తున వ్యాప్తించాయి. ఈ మంటలు కాస్తా ఇళ్ల సమీపంలోకి వ్యాపించడంతో గ్రామస్థులు వెంటనే బకెట్లతో మంటలను గ్రామస్థులు ఆర్పారు. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి మంటలను పూర్తిగా ఆర్పేశారు.

- ఉపాధి ఆధారంగా మారుతున్న నామధేయాలు
- అసలు పేరు కొసరుగా మారుతున్న వైనం



వృత్తిపేరే.. ఇంటిపేరు..

జమ్మికుంట రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన ఇద్దరు చిన్ననాటి మిత్రులు చాలాకాలం తర్వాత ఓ శుభకార్యంలో కలుసుకున్నారు. బడిలో కలిసి చదు వుకున్న జ్ఞాపకాలను నెమరువేసు కున్నారు. యాంత్రిక జీవనంలో ఇన్నాళ్లు గడిపిన మిత్రుల మధ్య మళ్లీ మాటల చాటింగ్‌లు పెరిగాయి. ఓ రోజు శ్రీనివాస్ అనేమిత్రుడు అనుకోకుండా జమ్మికుంటకు వచ్చాడు. పని పూర్తి చేసుకున్న అనంతరం తన చిన్ననాటి స్నేహితుడైన పొనగంటి సంపత్‌ను కలవాలని అనుకున్నాడు. వెంటనే మిత్రుడికి ఫోన్‌చేశాడు.. కలవడం లేదు. సరేలే అని ఇంటికి వెళ్దామని బయల్దేరాడు. సంపత్ ప్రస్తుతం అక్కడ ఉండటం లేదు. ఈ విషయం తెలియడంతో అక్కడ ఉన్న వారిని అడిగాడు. పొనగంటి సంపత్ అనే వ్యక్తి ఇక్కడ ఉండడని వారు తెలిపారు. దీంతో నిరాశగా తిరుగుప్రయాణం అయ్యాడు. తర్వాత ఈ విషయం తన మిత్రుడికి ఫోన్‌లో వివరించాడు. అప్పుడు సదరు మిత్రుడు సంపత్ అసలు విషయం చెప్పాడు. ఒరేయ్ నేను జేసీబీ(ఎక్స్‌కావేటర్) కొన్నాను. అప్పటి నుంచి నన్ను అందరూ ఇంటి పేరు కాకుండా పేరు పక్కన జేసీబీ సంపత్ పిలుస్తారు. అలా నా ఇంటి పేరు, నాపేరును నాకు తెలియకుండానే మార్చేశారు. మా ప్రాంతంలో జేసీబీ సంపత్ అంటేనే అందరికీ తెలుసని చెప్పాడు. పాతికేళ్లుగా తనవృత్తి తనఇంటి పేరుగా ముద్ర పడిపోయిందని సమాధానం ఇచ్చాడు. ఇలా జమ్మికుంటలో చాలామంది ఇంటిపేర్లు మారిపోయాయి. వారు చేస్తున్న పనే వారి ఇంటి పేరుగా మారింది. వారి ఇంటి పేర్లతో పిలిస్తే ఎవరికీ తెలియదు. వారు చేస్తున్న పని పేరు చెప్పి పిలిస్తేనే అందరికీ అర్థమవుతుంది. అటువంటి వారి గురించి ఓ సారి తెలుసుకుందాం..



జేసీబీ కొన్నాను.. అదే నా ఇంటి పేరుగా మారింది..

- పొనగంటి సంపత్, జమ్మికుంట

వ్యాపార అవసరాల కోసం 28 ఏళ్ల క్రితం జేసీబీ కొన్నాను. జమ్మికుంట పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం, పూడికతీత, కాంట్రాక్ట్ పనులు చేసేవాడిని. జమ్మికుంట ప్రాంతంలో మొట్టమొదటిసారి జేసీబీ కొనుగోలు చేయడంతో నాపేరు జేసీబీ సంపత్‌గా మారిపోయింది. ఇప్పుడు పొనగంటి సంపత్ అంటే ఎవరికీ తెలియదు. జేసీబీ సంపత్ అంటే చిన్నపిల్లాడైనా గుర్తుపడతాడు.



వ్యాపారమే నా ఇంటి పేరుగా మారింది

- కర్రె సుబ్బారావు, జమ్మికుంట

జమ్మికుంటలో 40 సంవత్సరాలుగా షాబాద్ బండ వ్యాపారం చేస్తున్నాను. దీంతో నా ఇంటి పేరు బండ సుబ్బారావుగా మారిపోయింది. ఈ పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకు నా ఇంటి పేరు ఎవరికీ తెలియదు. నా పేరు బండ సుబ్బారావు అని పిలిస్తేనే అందరికీ తెలుస్తుంది.



నన్ను పొగాకు కొండయ్య అనే పిలుస్తారు..

- మురికి కొండయ్య, జమ్మికుంట

20 సంవత్సరాల క్రితం పొగాకు వ్యాపారం చేశాను. తర్వాత ఎలక్ట్రికల్ షాప్ పెట్టుకున్నాను. మొదట పొగాకు వ్యాపారం చేశాను కాబట్టి నా పేరు పొగాకు కొండయ్యగా మారిపోయింది. నా సొంత ఇంటి పేరు మురికి కొండయ్య అంటే ఎవరికీ తెలియదు. ఎలక్ట్రికల్ షాపు పెట్టుకున్నప్పటికీ పొగాకు కొండయ్య అని పిలుస్తారు.

పెరిగిన వార్పిన్ కార్మికుల కూలి - సమ్మె విరమణ

సిరిసిల్ల రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చీరల తయారీలో పనిచేసే వార్పిన్ కార్మికులకు పాలిస్టర్ యజమానులు కూలి పెంచడంతో కార్మికులు చేపట్టిన సమ్మెను ఆదివారం విరమించారు. వార్పిన్ కార్మికులకు కూలి నిర్ణయించాలంటూ వారం రోజులుగా సీఐటీయూ వార్పిన్ వర్క్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్నారు. ఆదివారం జరిగిన చర్చల్లో యజమానులు ప్లేన్ భీముకు 1250 మీటర్ల వరకు 475 రూపాయలు, జరీ టాప్ భీముకు 1250 మీటర్ల వరకు 275 రూపాయలు, భీము 1250 మీటర్లపైన పోస్తే అదనంగా లెక్క చేసి కూలీ తీసుకోవాల్సి ఉంటుందని పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కార్యదర్శి అంకారపు రవి, గోవిందు రవి, దూడం శంకర్ ప్రకటించారు. చర్చల్లో సీఐటీయూ నాయకులు కోడం రమణ, మూషం రమేష్, వార్పిన్ వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, ఉడుత రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం

గంబీరావుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలోని మా అనాథ వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం మాతృ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మా అనాథ ఆశ్రమం నిర్వాహకుడు, నంది అవార్డు గ్రహీత మల్లుగారి నర్సాగౌడ్ అనాథ వృద్ధులకు బిస్కెట్లు, పండ్లు అందజేశారు. ఎంత ఎదిగిన అమ్మను చిన్న చూపు చూడొద్దని, అమ్మ మనస్సు నొప్పించే విధంగా ఎప్పుడు ప్రవర్తించవద్దని సూచించారు. మన ఊపిరి ఉన్నంత వరకు అమ్మకు తోడుగా నీడగా అండగా ఉండాలని నర్సాగౌడ్ పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్ చేపట్టడం హర్షణీయం





సిరిసిల్లలో పహల్గాం అమరులకు నివాళులర్పిస్తున్న కవులు, మల్కపేట రామాలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతమైన పహల్గాంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు హిందువులను కాల్చిచంపడంతో భారత సైన్యం మాత్రం అపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు చేయడం హర్షనీయని సిరిసిల్ల జిల్లా సాహితీ సమితిఅధ్యక్షుడు జనపాల శంకరయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణంలో అదివారం జిల్లాసాహితి సమితి అధ్వర్యంలో ఉగ్రవాదుల చేతి చనిపోయిన అమరులకు నివాళ్లు అర్పించి మౌనం పాటించారు. అనంతరం సైన్యం ,చేపట్టిన అపరేషన్ సింధూర్‌కు సంఘీభావం ప్రకటించడంతోపాటు సైన్యానికి అండగా మనోధైర్యాన్ని కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శంకరయ్య మాట్లాడుతూ పహల్గాంలో హిందువులను ఉగ్రవాదులు కాల్చిచంపి మహిళల సిందూరాన్ని తడిచివేయడంతో సైన్యం సిందూర్ పేరుతో ఉగ్రవాదులను ముట్టబెట్టడం హర్షణీయమన్నారు. పాకిస్తాన్ కాల్పుల్లో సైనికుడు మురళీనాయక్ మరణించడంతో అయనకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కవులు బూర దేవానందం, గుండెల్లి వంశీ, సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ఏనుగుల ఎల్లయ్య, కోడం నారా యణ, అంకారపు జ్ఞానోభా తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో పూజలు

కోనరావుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట రామాలయంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ ఆధ్వర్యంలో త్రివిధ దళాల సైనికుల కోసం ఆదివారం పూజలు నిర్వహించారు. భారతదేశం పాకిస్తాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంలో మన సైనికులకు ఎలాంటి ఆపద కలగకుండా భగవంతుని కృప ఉండాలని కోరుతూ పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు అన్ని దేవరాజు, సుధాకర్, బొల్లారం తిరుపతి, గంగయ్య, రాజేష్, మహిపాల్, విజయ్, వేణు, శ్రీరాములు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అమర జవానులకు నివాళి

వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలంలో అమర జవానులకు నివాళు లర్పించారు. వీర్నపల్లి మండలం సీతారాంనాయక్ తండాలో నార్కోటిక్స్ ఎస్పీ రాంరెడ్డి ఆధ్వర్యంలో గిరిజనులు, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రపు రాములు, బండారు బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఘన నివాళులర్పించారు.



సీతారాం నాయక్ తండాలో నివాళులర్పిస్తున్న గిరిజనులు

పంచాయతీ ఎన్నికలపై అయోమయం

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల నిర్వహణకు కీలకంగా ఉండే ఓటరు జాబితాను సిద్ధం చేశారు. 260 గ్రామపంచాయతీల్లో మూడు లక్షల 46 వేల 259 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చారు. ఇందులో పురుషులు 1,67,686 మంది, మహిళలు 1,78,553 మంది, 20 మంది ట్రాన్స్‌జెండర్ ఓట్లు ఉన్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. 200 మంది ఓటర్లు ఉన్న చోట ఒక ప్రీసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 వరకు ఒక ప్రీసైడింగ్ అధికారి ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 వరకు ఉండే పోలింగ్ కేంద్రంలో ప్రీసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించనున్నారు. జిల్లాలో 200 మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రాలు, 134 ఉండగా, 400 ఓటర్లు ఉన్న కేంద్రాలు 468 ఉండగా, 650 ఓటర్లు ఉన్నవి 76 కేంద్రాలు ఉన్నాయి.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యుల అభ్యర్థులకు 20 గుర్తులు కేటాయించారు. సర్పంచ్‌లకు సంబంధించి పింక్ కలర్ బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. సర్పంచ్‌ల ఎన్నికల గుర్తుల్లో ఉంగరం, కత్తెర, ఫుట్‌బాల్, బ్యాట్, బ్యాట్స్‌మెన్, స్టంప్స్, లేడీ పర్స్, టీవీ రిమోట్, టూత్ పేస్ట్, పాన్, చెత్తడబ్బా, బెండకాయ, కొబ్బరి చెట్టు, వజ్రం, నల్ల బోర్డు, బకెట్, డోర్ హ్యాండిల్, చేతికర్ర, మంచం, బిస్కెట్, వేణువు, జల్లెడ, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, పడవ, చైన్, చెప్పులు, గాలిబుడగ, తదితర గుర్తులు ఉన్నాయి. వార్డు సభ్యులకు సంబంధించి పొయ్యి, స్టూల్, బీరువా, గ్యాస్ సిలెండర్, గౌన్, ఈల, కుండ, గరాట, ముకుడు, డిష్ ఏంటీనా, ఐస్‌క్రీమ్, గాజు గ్లాస్, పోస్ట్ డబ్బా, కవర్, కటింగ్ ప్లేయర్, హాకీ, కర్రబంతి, నైక్ టై, విద్యుత్ స్థంబం, షటిల్, గుర్తులు కేటాయించారు. గుర్తుల్లో కొన్ని గుర్తుంచుకోవడం కష్టమే అన్నట్లుగా భావిస్తున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

చందుర్తి, మే 11 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో ఆదివారం సీసీ రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి 23 లక్షల రూపాయలు ఈజీఎస్ నిధులు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్కకు మాజీ సర్పంచ్ భీమా రాజు కళ్యాణికనకరాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొత్త శ్రీనివాసరెడ్డి, తిప్పని శంకర్, తిప్పని నారాయణ, కిషన్, దుమ్మ శంకర్, ఆనందం, బొడ్డు భూమయ్య, నర్సయ్య, మల్లేశం, బొడ్డు రాజయ్య, బొడ్డు తిరుపతి, చింత ముత్తయ్య, పత్తిపాక బాలయ్య, లింగ లింగయ్య, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు

చందుర్తి(రుద్రంగి) మే 11 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని ప్రహ్లాద పర్వతంపై వెలిసిన లక్ష్మీనరసింహ స్వామివారి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి వారి జయంతి సందర్భంగా ఆలయాన్ని మామిడి, అరటి ఆకులతో అందరంగా అలంకరించారు. ఆలయంలో ఉదయం నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

తంగళ్లపల్లి(ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామ శివారులోని ఇస్కాన్ టెంపుల్‌లో, తంగళ్లపల్లిలో లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకలన ఘనంగా జరిపారు. విశేష అలంకరణ, సుదర్శన హోమం, అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమలలో అచ్యుత దాస ప్రభుజీ, మచ్చ శ్రీనివాస్, సామల రమేష్, సుద్దాల శ్రీనివాస్ గౌడ్, మచ్చ ఆంజనేయులు, రాపెల్లి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

గంబీరావుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. 21 వార్షికోత్సవంలో బాగంగా 11 నుంచి ఆలయంలో స్వామివారి బ్రహోత్సవాలు కొనసాగుతు న్నాయి. స్వామి వారి బ్రహోత్సవాల్లో భాగంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం అత్యంత వైభవం సాగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరగగా, పెద్దసంఖ్యలో భక్తులు తిలకించారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శంకర్(ఫైల్)

వేములవాడ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన కోనాయిపల్లి రెండు ద్విచక్రవాహనాలు ఆదివారం ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. నాగాయపల్లి గ్రామానికి చెందిన శంకర్(55) ఆదివారం వేములవాడ నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. చందుర్తి నుంచి వేములవాడ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న సిరిసిల్ల మండలం చంద్రంపేటకు చెందిన వ్యక్తులు శంకర్ వాహనాన్ని వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన కోనాయిపల్లి వద్ద బలంగా ఢీకొట్టాడు. దీంతో శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్‌కు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు, మృతుడికి భార్య కూతురు ఉన్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో గంభీరావుపేట విద్యార్థిని ప్రతిభ



దొంతి స్ఫూర్తి

గంబీరావుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన దొంతి స్ఫూర్తి ఎప్‌సెట్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయిలో 525 ర్యాంక్ సాధించింది. దొంతి స్ఫూర్తి 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు సిద్దిపేటలో చదివి, 10 జీపిఏ సాదించింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదివి 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించింది. ఆదివారం విడుదలైన ఎప్‌సెట్ పరీక్ష పలితాల్లో స్ఫూర్తి 525 ర్యాంక్ సాధించింది. దీంతో స్ఫూర్తి తల్లిదండ్రులు దొంతి శ్రీనివాస్-జ్యోతి, అధ్యాపకులు స్ఫూర్తిని అభినందించారు.

సిరిసిల్ల రూరల్ (ఆంధ్రజ్యోతి): ఎంసెట్ ఫలితాల్లో సిరిసిల్ల పట్టణానికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించారు. సిరిసిల్ల పట్టణంలోని సహస్ర జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులతో ఉత్తమ ప్రతిభ కనబరిచారు జి. భాగ్యలక్ష్మి 5991 ర్యాంకు, వి అక్షిత 11,944 ర్యాంకు, ఆర్ అంకిత 19893 ర్యాంకు సాధించారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం మరియు అధ్యాపక బృందం అభినందించారు.

ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట..

రూ. నలభై కోట్లు స్వాహా

కరీంనగర్ క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట 100 మంది వద్ద 40 కోట్ల రూపాయల వరకు డబ్బులు తీసుకుని ఏడాదిగా జాడలేకుండా పోయాడని బాధితులు ఆదివారం సప్తగిరి కాలనీలోని నిందితుడి ఇంటి వద్ద ధర్నా చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... సప్తగిరి కాలనీకి చెందిన మొలుగూరి సురేష్ స్థానికు లను నమ్మించి ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌లో డబ్బులు పెడితే త్వరగా రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మించాడు. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మరి కొందరికి చెప్పాడు. ఇలా 100 మంది వద్ద 40 కోట్ల రూపాయలు తీసుకున్నాడు. కొంతకాలం పాటు డబ్బులకు వడ్డీ చెల్లించడం, ఉద్యోగం ఇచ్చిన వారికి వేతనాలు ఇచ్చాడు. అనంతరం ఎవరికీ చెప్పకుండా మాయమయ్యాడు. ఏడాది కాలంగా సురేష్ బాధితులకు వడ్డీ ఇవ్వడం లేదు. వేతనాలు చెల్లించడం లేదు. దీనిపై కరీంనగర్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. ఇప్పటి వరకు సురేష్ జాడ తెలియలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



సురేష్ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

పున్నం చందర్‌కు బెస్ట్ సైకాలజిస్ట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సైకాలజిస్ట్ పున్నం చందర్

సిరిసిల్ల రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా అసుపత్రిలో సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్న పున్నం చందర్‌కు బెస్ట్ సైకాలజిస్ట్ అవార్డును ఆదివారం అందుకున్నారు. సిరిసిల్లలో నేతన్న అత్మహత్యల నేపథ్యంలో నేతన్నల్లో మనోధైర్యాన్ని కల్పించాలనే సంకల్పంతో సైకాలజిస్ట్‌గా విధుల్లో చేరిన పున్నం చందర్ 15 సంవత్సరాలుగా నేతన్నలకు అనేక రకాలు సేవలను అందిస్తున్నారు. అంతేకాకుండా మానసికంగా ఇబ్బందు లు పడుతున్న కార్మికుల సమస్యలను తెలుసుకుని నూతన పద్ధతుల్లో వారి సమస్యలను పరిష్కరిస్తూ వ్యక్తిగత కౌన్సెలింగ్, వర్క్‌షాపులు నిర్వహించడంతో పాటు కార్మికులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టి అనేక మందికి స్ఫూర్తిగా నిలిచారు. అయన చేస్తున్న కార్యక్రమాలతో పాటు సేవలను ప్రముఖ సంస్థ తెలంగాణ సైకాలజిస్ట్ అసోషియేషన్ వారు ప్రతిసారీ వార్షికంగా దేశవ్యాప్తంగా విశిష్ట సేవలను అందిస్తున్న వారికి ఈ అవార్డును అందిస్తుండగా ఈసారి సిరిసిల్లకు చెందిన సైకాలజిస్ట్ పున్నం చందర్‌ను ఎంపిక చేసి హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ త్రిపురాణ వెంకరత్నం పున్నం చందర్‌కు అవార్డును అందించి సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డును అందుకున్న పున్నం చందర్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం ఎంతో గోప్పవరమన్నారు. సమాజంలో మానసిక ఆరోగ్యంపై అవగహన పెంచడానికి సేవలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సైకాలజిస్ట్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోత్కూరు రామచందర్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ క్రీడాకారులకు రాగి జావ పంపిణీ



క్రీడాకారులకు రాగి జావ, కోడిగుడ్లు అందజేస్తున్న నాయకులు

చందుర్తి (రుద్రంగి) మే 11 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు మాజీ ఎంపీటీసీ మంచె రాజేశం-లావణ్య దంపతులు ఆదివారం రాగి జావ, గుడ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. వేసవి శిక్షణ శిబిరానికి సహకరిస్తున్న దాతలకు పీటీ దేవయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు కర్ణవత్తుల చందు, దయ్యాల శ్రీనివాస్, గుగ్గిల తిరుపతి, అరిపెల్లి రవి, అల్లాడి గిరి, ధర్మపురి శ్రీనివాస్, అరుణ్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలి

కరీంనగర్ టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ వంచ శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ వంచ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో టీడీపీ శ్రేణులు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని అన్నారు.

గ్రామాల్లో తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉందన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీని గెలిపించుకుని, అభివృద్ధి సంక్షేమ ఫలాలు పొందాలని ఎదురుచూస్తున్నారని అన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా పోటీ చేయాలనుకునేవారు పార్టీ శ్రేణులు, ప్రజలతో సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు పర్లపెల్లి రవీందర్, నాయకులు కళ్యాడపు ఆగయ్య, రొడ్డ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్లన్న జాతరకు తరలివచ్చిన భక్తులు

ఓదెల, మే 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుం బాలతో తరలివచ్చి పూజలు నిర్వహిం చారు. వివిధ ప్రాంతాల నుంచి ఆలయా నికి అధిక సంఖ్యలో భక్తులు చేరుకొని ఆలయంలో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. కోడె మొక్కులను చెల్లించారు.



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

నేడు లక్ష్మీనరసింహస్వామి జాతర

కథలాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని దుంపెట శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర ఆదివారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయాత్పూర్వం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు కోరారు. మంగళవారం తెల్లవారుజామున రథోత్సవం, పుష్పయాగం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



అనిల్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

వేములవాడ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో ఈ నెల 16వ తేదీ నుంచి 19వతేదీ వరకు జరిగే సౌత్ ఏషియన్ సేస్తో బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు చెక్కపల్లి గ్రామానికి చెందిన ఎడపల్లి అనిల్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పలువురు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు వంగపల్లి మల్లేశం, డీసీసీ సెక్రెటరీ బాలసాని శ్రీనివాస్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ చిలుక ప్రభాకర్, మాజీ సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మ్యాక స్రవంతిహరినందన్‌రెడ్డి, నాయకులు అశీల శేఖర్, రమణారెడ్డి, దాన వేణు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 20 నుంచి 22 వరకు జరిగే పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, అర్చకులు, అధికారులు హనుమాన్ జయంతి ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ఉపప్రధానార్చకులు చిరంజీవి, పర్యవేక్షకులు సునీల్‌కుమార్, హరిహరనాథ్ ఉన్నారు.

కార్మికులు సమ్మెను వ్యతిరేకించాలి

గోదావరిఖని, మే 11(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల అనుబంధ సంఘాలైన కార్మిక సంఘాలు రాజకీయ ఎజెండాను అమలుచేయడానికి, కార్మిక సంఘాల ఉనికి చాటుకోవడానికి ఈనెల 20న చేస్తున్న రాజకీయ సమ్మెను సింగరేణి కార్మికులు వ్యతిరేకించాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి కార్మికవర్గానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం బీఎంఎస్ కేంద్ర కార్యాలయంలో యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో విపత్కర పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ప్రజలకు, ప్రభుత్వాలకు రాజకీయాలకు అతీతంగా మద్దతు పలకాల్సిన రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు సమ్మెకు వెళ్లడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, రక్షణ, మౌలిక సదుపాయాలు, ఆర్థిక ప్రయోజనం లేని రాజకీయ ప్రేరేపిత సమ్మెను వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు కర్రావుల మహేష్, ఆకుల హరిణ్, సాయవేణి సతీష్, మేడ రామ్మూర్తి, పెంచాల వెంకటస్వామి, తుమ్మ గట్టయ్య వేణు పాల్గొన్నారు.

నవజాతశిశువు మృతి

వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

జగిత్యాలరూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే తమ బాబు మృతిచెందాడని బంధువులు ఆందోళనకు దిగిన సంఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన జ్యోష్న డెలివరీ కోసం జగిత్యాల ఎంసీహెచ్ ఆస్పత్రిలో శుక్రవారం చేరగా శనివారం బాబుకు జన్మనిచ్చింది.

నవజాత శిశువును చికిత్స నిమిత్తం తన ఆసుపత్రికి తీసుకురావాలని చెప్పడంతో ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లినట్లు బాధిత బంధువులు తెలిపారు. ఈ క్రమంలోనే ప్రైవేట్ ఆస్పత్రిలో బాబు మృతి చెందడంతో బంధువులు ఆందోళన చేపట్టారు. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే బాబు మృతిచెందాడని ఆరోపిస్తూ సదరు డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు. అయితే ఈ ఘటనపై నవజాతశిశువు తండ్రి శ్రీరాం కృష్ణంరాజు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.